సాక్షి పల్నాడు

సోమవారం ¦ 1 ¦ సెప్టెంబర్ ¦ 2025



ఘనంగా శ్రీలక్ష్మీ గణపతి హోమం

నరసరావుపేటఈస్ట్: నరసరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ఆదివారం శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,27,500 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 1,50,133 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలేనికి చెందిన గానుగపెంట వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు రూ.1,00,116 విరాళంగా ఆదివారం అందజేశారు.

న్యూస్‌రీల్

లాంచీస్టేషన్ ఆదాయం రూ.1,27,900



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండకు ఆదివారం పర్యాటకులు లాంచీలలో తరలి వెళ్లారు. లాంచీస్టేషన్‌కు రూ.1,27,900 ఆదాయం చేకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు. కొండను సందర్శించిన పర్యాటకులు బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన శిలాఫలకాలను తిలకించారు. అనంతరం మాచర్ల మండలంలోని అనుపు, ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు.

రేపటి నుంచి నృసింహుని వార్షిక పవిత్రోత్సవాలు



మంగళగిరి టౌన్: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక పవిత్రోత్సవాలు సెప్టెంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి కె. సునీల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల పాటు స్వామికి విశేష పూజలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 6,500 క్యూసెక్కులు నీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 216, బ్యాంక్ కెనాల్‌కు 1,486, తూర్పు కాలువకు 452, పశ్చిమ కాలువకు 208, నిజాపట్నం కాలువకు 413, కొమ్మూరు కాలువకు 2,380 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 2,33,975 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుంటూరు జిల్లాకు చెందిన గుత్తా శ్రీనివాసరావు ఎన్నికైనట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ తిరుమలేష్, సత్యం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలోని లయోలా కాలేజీలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశంలో భాగంగా జిల్లాకు చెందిన గుత్తా శ్రీనివాసరావు ఎన్నిక కావడం గర్వకారణమన్నారు. నిరంతరం ప్రధానోపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే వ్యక్తి అని, ఆయన ఎన్నిక పట్ల పలువురు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు విజయ భాస్కర్, ఎండీ ఖాసీం తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు ఏపీ ఎన్‌జీఓ సంఘం అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ బాడీ మీటింగ్ విజయవాడలోని సంఘ కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భవనారి వెంకటేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. అఖిల భారత రాష్ట్ర ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన విద్యాసాగర్‌ను నేతలు సత్కరించారు.



అమరావతికి నిమజ్జనం నిమిత్తం తరలి వెళుతున్న విఘ్నాధిపతి ప్రతిమలు



అమరావతికి ఊరేగింపుగా గణపయ్యను తీసుకెళ్తున్న దృశ్యం



గురజాలలో డప్పు వాయిద్యాలతో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్యా..

జై బోలో గణపతి మహారాజ్ కీ.. జై... అంటూ వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపులు ఆదివారం కోలాహలంగా సాగాయి. ఐదవ రోజు కావడంతో వాడవాడలా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, భక్తి గీతాలాపనలు, సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా వాహనాలపై అలంకరించిన గణనాథులను మేళతాళాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి భక్తులు తరలించారు.

–సాక్షి నెట్‌వర్క్

బార్‌లా తెరిచిన సర్కార్!

- నేటి నుంచి అర్ధరాత్రి వరకు బార్‌లు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతి
- కూటమి ప్రభుత్వం కొత్త బార్ పాలసీ అమలుతో పెరగనున్న విక్రయాలు
- ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 వరకు తెరిచి ఎక్కువ తాగేందుకు ఏర్పాట్లు
- మద్య నియంత్రణ కంటే ఆదాయంపైనే దృష్టి పెట్టిన కూటమి పాలకులు
- మద్యం మత్తులో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు, నేరాలు , ఘర్షణలు
- ఇవన్నీ మరిచి రాబడి మాత్రమే చాలనే రీతిలో నిర్లక్ష్యంగా ప్రభుత్వం తీరు

ప్రజారోగ్యం పక్కనపెట్టి ఆదాయంపైనే కూటమి ప్రభుత్వం దృష్టి

ప్రజారోగ్యం గురించి క్షణమైనా ఆలోచించని కూటమి ప్రభుత్వం మద్యం ద్వారా ఆదాయం పొందడమే పరమావధిగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఎప్పుడంటే అప్పుడు వైన్స్‌లలో మద్యం లభ్యం అవుతోంది. ఇది చాలదన్నట్లు బార్ అండ్ రెస్టారెంట్లను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచే అవకాశమిచ్చింది. మద్యం మత్తులో ప్రమాదాలు, ఘర్షణలు, ఇతర నేరాలు జరుగుతున్నా చీమ కుట్టినట్లు కూడా లేదు. పైగా వాటికి ఆజ్యం పోసేలా, కుటుంబాలు నాశనం అయ్యేలా మద్యం తాగాలని ప్రోత్సహిస్తున్నట్లు వ్యవహరిస్తోంది.



నరసరావుపేట టౌన్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బార్ పాలసీ ప్రకారం ఇకపై అర్ధరాత్రి 12 గంటల వరకు బార్ అండ్ రెస్టారెంట్లు కొనసాగనున్నాయి. నేటి నుంచి మరో మూడేళ్ల పాటు ఈ నూతన పాలసీ అమలు చేయనున్నారు. గతంలో ఉన్న బార్ పనివేళలను రెండు గంటలపాటు పెంచింది. ఇప్పటి వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే బార్ అండ్ రెస్టారెంట్‌లు తెరిచి ఉండేవి. ఇకపై ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్విరామంగా కొనసాగనున్నాయి. కొత్త పాలసీ నిబంధనల ప్రకారం అర్ధ రాత్రి వరకు మద్యం అమ్మకాలు జరగనున్నాయి.

ఎప్పుడు కావాలంటే అప్పుడు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ద్వారా ప్రభుత్వానికి, తమ నాయకులకు ఆదాయాన్ని సమకూర్చే పనిలో పడింది. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా గ్రామాల్లో బెల్టు షాపులు వెలిశాయి. తద్వారా ఏ సమయంలోనైనా పల్లెల్లో మద్యం అందుబాటులో ఉండటం ప్రజలకు చేటు కలిగిస్తోంది. అధిక మద్యం తాగి అనేక మంది మృత్యువాత పడుతున్నారు. అదేవిధంగా అనారోగ్యం పాలవుతున్నారు. దీంతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి.

ఆదాయమే పరమావధిగా...

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి తీసుకువెళ్లింది. వేళాపాళా లేకుండా మద్యం దుకాణాలు ఇప్పటికే నిర్వహిస్తున్నారు. దీంతో ఎక్కడపడితే అక్కడ మద్యం మత్తులో మందుబాబులు రోడ్డు పక్కన అపస్మారకస్థితిలో పడిపోతున్న ఘటనలు జరుగుతున్నాయి. మద్యం నియంత్రణపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం మద్యాన్నే ఆదాయంగా మలుచుకొని, బార్ అండ్ రెస్టారెంట్‌లను కూడా అర్ధరాత్రి వరకు కొనసాగించటం దాని ధనదాహానికి నిదర్శనం.

రోడ్డున పడుతున్న కుటుంబాలు



మద్యం మత్తులో రోడ్డుపై నిద్రిస్తున్న దృశ్యం

మద్యం తాగి చోటు చేసుకుంటున్న మరణాలు, అనారోగ్య సమస్యలు గడిచిన ఏడాదిన్నర కాలంలో పెరిగిపోయాయి. ఒకప్పుడు కుటుంబాలకు ఆధారమైన వారు ప్రస్తుతం మద్యానికి బానిసలు కావటంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీనికి తోడు యువత అధిక మోతాదులో మద్యం తాగి అనారోగ్యం పాలవుతున్నారు. మద్య నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఆర్థికంగా లాభం కోసం మద్యం అమ్మకాలను ప్రోత్సహించటం సమాజంపై మరింత భారం మోపుతోంది. ప్రజల ఆరోగ్యం కంటే ప్రభుత్వ ఆదాయమే ముఖ్యం అనే చందంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మహిళలు మండిపడుతున్నారు.

ప్రజలకు చేటు చేసేలా...

మద్యం మత్తులో రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. మరో వైపు అర్ధరాత్రి ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. గత ఏడాది క్రైం రేటును పరిశీలిస్తే మద్యం మత్తులోనే ఎక్కువ నేరాలు జరిగినట్లు తెలుస్తోంది. ఏడాదిన్నర కాలంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యంపై నియంత్రణ లేకపోవటంతో రాత్రుళ్లు అఘాయిత్యాలు జరుగుతున్నాయి. మద్యం దుకాణాల వద్ద తరుచూ ఘర్షణలు పెరిగిపోయాయి. వీటిపై దృష్టి సారించి మందుబాబులను కట్టడి చేయాల్సిన ప్రభుత్వం.. అర్ధరాత్రి వరకు తాగి ఊగండంటూ అనుమతులు ఇచ్చేసింది.

ముగిసిన క్యారమ్ పోటీలు

ఆంధ్ర స్టేట్ క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ



ప్రథమ బహుమతి అందుకుంటున్న సీహెచ్ జనార్ధనరెడ్డి, ఎ.భవాని

చిలకలూరిపేట: ఏపీ స్టేట్ క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేట్ ర్యాంకింగ్ క్యారమ్ పోటీలు సీఆర్ క్లబ్‌లో రెండో రోజైన ఆదివారం ముగిశాయి. పురుషులు, మహిళల విభాగంలో విడివిడిగా నిర్వహించిన ఈ పోటీలలో రాష్ట్ర నలుమూలల నుంచి 150 మంది పురుషులు, 20 మంది మహిళలు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో తొలి నాలుగు స్థానాల్లో సీహెచ్ జనార్ధనరెడ్డి (విశాఖపట్నం), ఎన్.వెంకయ్య (నెల్లూరు), బి.జయకుమార్(గుంటూరు), బి.పవన్‌కుమార్ (అనంతపురం) నిలిచారు. మహిళల విభాగంలో ఎ.భవాని, ఎల్.హారిప్రియ, ఎంఎస్‌కే హారిక, ఎస్‌కే హుస్నా సమీర బహుమతులు సాధించారు. ఈ నలుగురు విశాఖపట్నం వారే కావడం విశేషం. సీహెచ్ జనార్ధనరెడ్డి ఏడో ప్రపంచ కప్ క్యారమ్ పోటీలలో పాలొనేందుకు సీఆర్ క్లబ్ తరఫున రూ.లక్ష సహాయం అందించారు. ఏపీ స్టేట్ క్యారమ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలకు చీఫ్ రిఫరీగా డాక్టర్ షేక్ సాజిదా, అసిస్టెంట్ చీఫ్ రిఫరీగా ఎండీ సిరాజ్ బాషా వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్ క్లబ్ అధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.నరసింహారావు, క్లబ్ కల్చరల్ ఇన్‌చార్జి గోరంట్ల నారాయణ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన విజయనగరం జట్టుతో నిర్వాహకులు

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- లయోలా ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి
- ముగిసిన అంతర్రాష్ట్ర మహిళల సాఫ్ట్‌బాల్ పోటీలు



గ్రాండ్ ఫైనల్‌లో తలపడుతున్న గుంటూరు, విజయనగరం జట్లు

సత్తెనపల్లి: విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని లయోలా ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల సమీపంలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న 12వ అంతర్ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రమం తప్పని సాధన ముందుకు తీసుకు వెళుతుందన్నారు. రిటైర్డ్ పీడీ దాసరి కోటేశ్వరరావు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.నరసింహారెడ్డి, గుంటూరు జిల్లా సెక్రెటరీ పి. సామంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిరుపతి, ట్రెజరర్ జనార్దన్ యాదవ్, లయోలా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. అనంతరం విజేతలను అభినందించి, బహుమతులు అందించారు.

హోరాహోరీగా పోటీలు...

సెమీఫైనల్స్‌లో వైఎస్సార్ కడప, గుంటూరు జట్లు తలపడ్డాయి. 0–5తో గుంటూరు విజయం సాధించింది. విజయనగరం, కృష్ణా జట్లు పోటీ పడగా, 11–2తో విజయనగరం విజేతగా నిలిచింది. ప్రీ ఫైనల్స్‌లో గుంటూరు, విజయనగరం తలపడ్డాయి. గుంటూరు 3–2తో గెలిచింది. వైఎస్సార్ కడప, కృష్ణా జట్లు తలపడిన పోటీలో 4–2తో వైఎస్సార్ కడప జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో విజయనగరం, వైఎస్సార్ కడప జట్లు తలపడ్డాయి. 8–2తో విజయనగరం విజయం సాధించింది. గ్రాండ్ ఫైనల్‌లో గుంటూరుపై విజయనగరం 5–4తో గెలిచింది. చాంపియన్‌గా విజయనగరం, రన్నర్స్‌గా గుంటూరు, తృతీయ స్థానం వైఎస్సార్ కడప, నాలుగవ స్థానం కృష్ణా జిల్లా జట్టు కైవసం చేసుకున్నాయి.



రెండవ స్థానంలో నిలిచిన గుంటూరు జట్టుతో నిర్వాహకులు

పండగలోనూ పోలీస్ 'పచ్చ'పాతం

అక్రమ కేసులు పెట్టడం, స్టేషన్‌కు తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేయటం ఇప్పటివరకు కూటమి పాలనలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి పండగ వేడుకల్లో కూడా అదే 'పచ్చ'పాతం చూపుతున్నారు. అధికార పార్టీ నేతలకు సాగిలపడి ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలిగిస్తున్నారు. వినాయక చవితి వేడుకల్లో వైఎస్సార్ సీపీ వారిపై అడ్డగోలు ఆంక్షలు విధించడమే దీనికి నిదర్శనం

- కూటమి సర్కారుకు సాగిలపడుతున్న పోలీసు అధికారులు
- వినాయక నిమజ్జనంలోనూ అధికార పార్టీ నేతలపై ప్రేమ
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు మాత్రం అడ్డగోలు ఆంక్షలు
- ప్రజాస్వామ్య స్ఫూర్తిని అవమానపరుస్తున్న అధికారులు

చవితి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ వారికే అడ్డగోలు నిబంధనలు



వినాయక నిమజ్జనంలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఫొటోలతో డ్యాన్సులు చేస్తున్న టీడీపీ నాయకులు

సాక్షి టాస్క్ ఫోర్స్: కూటమి పాలనలో వినాయక విగ్రహాల విషయంలోనూ పోలీసుల పక్షపాత వైఖరి మారడం లేదు. టీడీపీ నాయకుల మాటే తమకు శాసనమంటున్నారు. రాజ్యాంగబద్ధంగా తాము పని చేయబోమని తేల్చేస్తున్నారు. కూటమి నాయకుల మాటే తమకు వేదం అంటూ పల్నాడు జిల్లాలో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఇదే కోవలో వారి తీరుకు నిదర్శనంగా నిలిచే ఘటన గురజాల నియోజవర్గంలోని పిడుగురాళ్లలో జరిగింది.

అనుమతి ఇచ్చింది వారేగా..

వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు పోలీసులు ముందే ప్రెస్ మీట్ పెట్టి ప్రతిమకు, ఊరేగింపునకు, డీజేకి అనుమతి తీసుకోవాలని చెప్పారు. పిడుగురాళ్ల టౌను, మండలం పరిధిలోనే గ్రామాలలో ఉన్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆ మేరకు అనుమతులు తీసుకున్నారు. ఏ పోలీసులైతే అనుమతి ఇచ్చారో వారే ఇప్పుడు దానిని పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకులు చెప్పిన మండపాలు, విగ్రహాలు, డీజే ఊరేగింపులకు అవకాశం ఇస్తున్నారు. పండగల సంస్కృతి, సంప్రదాయాలను కూటమి ప్రభుత్వం తన రాజకీయాలతో కలుషితం చేస్తోంది. ఓ పక్క సనాతన ధర్మం తమదే , దేవుడిపై నమ్మకం తమకే ఉందంటూ వినాయక విగ్రహాల నిమజ్జనంలోనూ నీచ రాజకీయాలు చేస్తున్నారు. దీనికి పోలీసులు తమవంతుగా సాగిలపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ వారే లక్ష్యం

మండలంలోని పలు గ్రామాలలో అన్ని పార్టీల వారు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. అనుమతులు ఉన్నప్పటికీ వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ప్రతిమలకు మాత్రమే అడ్డగోలు నిబంధనలు విధించారు. కనీసం డీజిల్ పెట్టుకొని వినాయకుని నిమజ్జనం చేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా చేశారు. తాము పార్టీ పాటలు పెట్టబోమని చెప్పినా తమపై ఒత్తిడి ఉందని పోలీసులు అంగీకరించడం లేదు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన విగ్రహాల ఊరేగింపులో డీజేలు, నాయకుల బొమ్మలు, పార్టీ జెండాలు కనిపిస్తున్నా వారిని ఒక్క మాట కూడా అనడం లేదు. కూటమి నేతలైన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కటౌట్లతో వినాయక నిమజ్జనం ఊరేగింపులో పచ్చ నేతలు నానాయాగీ చేశారు. పవన్ కళ్యాణ్ వాడిన డైలాగులను పదేపదే పెట్టినా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తున్నారు.

పచ్చనేతలు చెబితేనే అనుమతి

గ్రామాలలో ఏ పార్టీ వారైనా విగ్రహ ఊరేగింపునకు స్థానిక టీడీపీ లీడర్లు చెబితేనే పర్మిషన్ ఇస్తామని పోలీసులు బహిరంగంగానే చెప్పటం ఆశ్చర్యకరంగా ఉంది. రూ.లక్షలు పెట్టి పండగ చేసుకుంటుంటే ఈ రాజకీయాలు ఏంటని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పార్టీకి ఒక రకంగా, వేరొక పార్టీకి మరోవిధంగా చట్టాలు ఉంటాయా? అని పోలీసుల తీరును ప్రశ్నిస్తున్నారు. అందరికీ ఒకే పోలీస్‌స్టేషన్ కదా.. మరి ఈ పక్షపాత ధోరణి ఎందుకని నిలదీస్తున్నారు. గత ఐదు సంవత్సరాలలో ఇలాంటివి ఎప్పుడూ ఎక్కడా జరగలేదని గుర్తుచేస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చాకే పోలీసులు ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. పిడుగురాళ్ల టౌన్‌లో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన విగ్రహాల ఊరేగింపులో భారీ శబ్దాలతో డీజే ఏర్పాటు చేశారు. మరి అదే టౌన్‌లో పల్నాడు హాస్పిటల్ వారు ప్రభుత్వానికి రూ.600 చలానా కట్టి పర్మిషన్ తీసుకున్నా పైనుంచి ఒత్తిడి అంటూ డీజేకు పర్మిషన్ ఇవ్వలేదు. పోలీసులు తెలుగుదేశం పార్టీ నేతల కోసం మాత్రమే విధులు నిర్వహిస్తున్నారా? అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. వారికి ప్రత్యేకమైన చట్టం ఏమైనా చేశారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

యథావిధిగా పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: సెర్ప్ సీఈఓ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ గత నెలలో చేసిన విధంగానే ఈ నెలలోనూ అర్హులైన లబ్ధిదారులందరికీ పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.15,000, రూ.10,000, రూ.6,000, రూ.4,000 కేటగిరిల పింఛన్ యథావిధిగానే చేస్తారని తెలిపారు.

ఒత్తిళ్ల జీవితంలో ఆధ్యాత్మిక చింతన అవసరం

ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు



మంగళగిరి టౌన్: ప్రస్తుత ఒత్తిళ్లతో కూడుకున్న జీవితాలలో ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అవసరమని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో వినాయక చవితి మహోత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. గణపతి భక్తబృందం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాల గణపతి విగ్రహం వద్ద లడ్డూలు, స్వామివారి కరెన్సీ నోట్ల దండలు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నగేష్‌బాబు మాట్లాడుతూ వినాయక చవితి వంటి ఉత్సవాలు ప్రజల్లో ఐకమత్యానికి దోహద పడతాయని, ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఏ మతమైనా అందరూ బాగుండాలని, ఇతరులకు హాని కలిగించరాదని అన్నారు. అనంతరం భక్తబృంద ప్రతినిధులు కృష్ణారావు, అయ్యప్పరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు కమాండెంట్ నగేష్‌బాబును ఘనంగా సత్కరించారు.

అందరి ఆరోగ్యం మన బాధ్యత



డీఎంహెచ్‌ఓ డాక్టరు విజయమ్మను సన్మానిస్తున్న ఏఎన్‌ఎంలు

బాపట్ల: జిల్లాలోని ప్రజలందరి ఆరోగ్యం మన బాధ్యతగా తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టరు విజయమ్మ పేర్కొన్నారు. గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2గా పదోన్నతులు కల్పించేందుకు కృషి చేసిన జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ విజయమ్మను ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ జిల్లా ప్రతి ఒక్కరికి మెరుగైన ఆరోగ్యం అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని గుర్తుచేశారు. కష్టపడి పని చేసేవారికి ఎప్పటికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.నాగేశ్వర రావు, ఏఎన్‌ఎంలు, ఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- మాజీ మంత్రి డొక్కా, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా హాజరు



మాట్లాడుతున్న డాక్టర్ చదలవాడ, చిత్రంలో మాజీ మంత్రి డొక్కా, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా

నరసరావుపేట: జిల్లా సరిహద్దుల మార్పు, పేర్ల మార్పు దిశగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో ఆదివారం పల్నాడు జిల్లాకి గుర్రం జాషువా పేరు పెట్టాలని కోరుతూ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ వినుకొండ సమీపంలోని చాట్రగడ్డపాడు గ్రామంలో జన్మించిన నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, పద్మభూషణ్ లాంటి బిరుదులు గుర్రం జాషువా పొందారన్నారు. చిన్నతనం నుంచి పేదరికం, అంటరానితనం మధ్య పెరిగి సమాజంలో రుగ్మతలపై అనేక పుస్తకాలు, కావ్యాలు రచించారని గుర్తుచేశారు. నాటక రంగం, సినీ రంగాల్లో పనిచేసిన గొప్ప వ్యక్తిగా కీర్తించారు. అటువంటి మహోన్నత వ్యక్తి అయిన గుర్రం జాషువా పేరు జిల్లాకి పెట్టాలన్నారు.

ఆత్మగౌరవం పెంచేలా...

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం గుర్రం జాషువా అన్నారు. కూటమి ప్రభుత్వం పల్నాడు జిల్లాకు లేదా గుంటూరుకు జాషువా పేరు పెట్టాలని సూచించారు. టీటీడీ బోర్డు మెంబరు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పల్నాడు ప్రజల ఆత్మగౌరవం దెబ్బతినకుండా పల్నాడు గుర్రం జాషువా జిల్లా అని లేదా గుర్రం జాషువా పల్నాడు జిల్లా అని పెడితే ప్రజలు ఆమోదిస్తారని అన్నారు. బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయ్ కుమార్, కన్వీనర్ కొరివి వినయ్‌కుమార్, గుర్రం జాషువా మనవడు బీఆర్ సుశీల్‌కుమార్, బలహీన వర్గాల ఐక్యవేదిక అధ్యక్షుడు నలబోతు రాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొల్లిపర బాలాజీ, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్, జన జాగృతి మండలి అధ్యక్షురాలు పిడతల రమాదేవి, ఎంఆర్‌పీఎస్ నాయకులు మల్లవరపు బాబు, దళిత కవి డాక్టర్ కాకాని సుధాకర్, ఎంఏఎం కాలేజ్ అధినేత, దళిత నాయకుడు క్రిస్టఫర్, ఎస్సీ, ఎస్టీ మాజీ విజిలెన్స్ సభ్యులు మరియదాసు, బీసీ నాయకులు బత్తుల వెంకటేష్ పాల్గొన్నారు.

నిమజ్జన వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి

జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్



పోట్లూరు గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్

శావల్యాపురం: వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకల్లో పోలీసు నిబంధనలు అందరూ పాటించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ జి.సంతోష్ అన్నారు. ఆదివారం మండలంలోని పొట్లూరు, వేల్పూరు గ్రామాల్లో జరుగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జనం వేడుకలు సందర్భంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గంలో శావల్యాపురం, బొల్లాపల్లి, నూజెండ్ల మండలాల్లో పలు గ్రామాల్లో పర్యటించామన్నారు. వినాయక విగ్రహాలు నిమజ్జనం సమయంలో శాంతిభద్రతలు విఘాతం కల్గకుండా ఉండటానికి ముందుస్తులో భాగంగా పర్యవేక్షణ చేస్తున్నట్లు వెల్లడించారు. సమస్యాత్మక గ్రామాలుగా ఉండే వాటిపై ప్రత్యేకంగా పోలీసు నిఘా ఉంచామన్నారు. ఐదో రోజు నరసరావుపేట డివిజన్ 397 విగ్రహాలు నిమజ్జనం జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై కమిటీ సభ్యులను బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని విగ్రహాలు నిమజ్జనం చేసే ఏరియాను పరిశీలించి పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ఆయనతోపాటు సీఐ గోపి, ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు, ఎస్‌బి కానిస్టేబుల్ రమేష్, స్టేషన్ రైటరు బాషా పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సభకు ప్రైవేట్ స్కూల్ బస్సులు

- నేడు పిడుగురాళ్లలో అన్ని ప్రైవేట్ స్కూళ్లకు సెలవు
- మంత్రులు రాకతో హడావుడి

సాక్షి టాస్క్ ఫోర్స్: కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తోంది. ఇచ్చిన హామీకి భిన్నంగా మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. ఇప్పటికి 15 రోజులు గడిసింది. అయితే సూపర్‌సిక్స్– సూపర్ హిట్ పేరుతో స్థానిక ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటో తేదీ సభ ఏర్పాటు చేశారు. పలువురు మంత్రులు హాజరు కానున్నారు.

ప్రైవేటు స్కూళ్లకు సెలవులు..

పల్నాడు జిల్లాలోని గురజాల నియోజక వర్గంలో స్త్రీ శక్తి పథకం ప్రారంభోత్సవంలో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభకు జనసమీకరణకు ప్రైవేట్ స్కూలు బస్సులు ఉపయోగించనున్నారు. అందుకు అనుగుణంగా పాఠశాలలకు సెలవు ఇప్పించారు. ఓ పక్క మేము ఉచిత బస్సు ఇచ్చాం అందరూ ఫ్రీగా బస్సు ఎక్కండి, ఆధార్ కార్డు చూపించండి అని చెబుతూ ఈ ప్రైవేట్ స్కూల్ బస్సును ఎందుకు వాడుతున్నారు అని నియోజవర్గ ప్రజలు నిలదీస్తున్నారు.

> ప్రియమైన తల్లిదండ్రులకు,
>
> మీకు తెలియజేయదలచుకున్నది ఏమనగా, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకం ప్రారంభోత్సవం సందర్భంగా పిడుగురాళ్ల లోని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ యాజమాన్యం అన్ని ప్రైవేట్ స్కూల్స్ కి సెప్టెంబర్ 1వ తేదీ, సోమవారం నాడు సెలవు ప్రకటించింది.
>
> దయచేసి ఈ విషయాన్ని గమనించి సహకరించగలరు.

తల్లిదండ్రులకు వాట్సప్ లో మెసేజ్

స్కూల్ సెలవుపై తల్లిదండ్రులు ఆవేదన..

ఆగస్టు నెలలో సుమారు పది రోజులు విద్యార్థులకు సెలవులు వచ్చాయి.. దీంతో చదువులకు ఆటంకం కలిగిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇలా అనధికారికంగా సెలవులు ఇస్తే ఎలా అని, సెప్టెంబర్‌లో దసరా సెలవులు కూడా వస్తున్నాయని, దీంతో చదువు ఎలా సాగుతుందని తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్నారు.

విద్యుదాఘాతంతో బిహార్ కూలీ మృతి

తెనాలి రూరల్: విద్యుదాఘాతంతో బిహార్‌కు చెందిన కూలీ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన ఓం ప్రకాష్(41) నాలుగేళ్లుగా మండలంలోని ఖాజీపేటలోని ప్లాస్టిక్ రీసైక్లింగ్ కంపెనీలో పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం కంపెనీలోని డ్రయ్యర్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వెనక్కు పడడంతో తలకు తీవ్ర గాయమైంది. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూల్యాంకన విధానాన్ని సరిదిద్దాలి

– యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కళాధర్



మాట్లాడుతున్న కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: కన్ను పోయేంత కాటుక ఎందుకు అనే చందంగా నేటి పరీక్ష విధానం ఉందని, తక్షణమే దీనిని సరిదిద్ది సరళంగానూ, సృజనాత్మకంగానూ మార్చాలని యూటీఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కళాధర్ అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో కళాధర్ మాట్లాడుతూ ప్రశ్నపత్రంలో ప్రశ్నలు, జవాబులు, జవాబు పత్రం చూస్తే ఇది పరీక్షలా కాక పిల్లలకు శిక్షలా ఉన్నాయని అన్నారు. ప్రశ్నపత్రం మూల్యాంకన, మార్కుల నమోదు ఉపాధ్యాయులను వారం రోజులు బోధనకు దూరం చేశాయని అన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు యూ.రాజశేఖర్‌రావు, రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎం కుసుమ కుమారి మాట్లాడుతూ శృతి మించిన పరీక్షా విధానం విద్యా విధానానికి పూర్తిగా నష్టం కలిగిస్తుందని అన్నారు. సెప్టెంబర్ లో బోధనేతర అంశాలు పెంచి ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడంపై నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉద్యోగులకు నాలుగు విడతల డీఏ ఇవ్వాల్సి ఉండగా ఒక్కటి కూడా ఇవ్వకపోవడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. పీఆర్సీ గడువు దాటి రెండేళ్లు దాటినా కనీసం కమిటీ కూడా వేయకపోవడం ఉద్యోగులను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తుందని, త్వరలో దీనిపై యూటీఎఫ్ పోరాట కార్యక్రమం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పీవీ శ్రీనివాసరావు, సహాధ్యక్షులు జి వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ కె.సాంబశివరావు, జి. వెంకటేశ్వరరావు, ఎండీ షకీలా బేగం, ఎం.గోవిందయ్య, ఏ.శ్రీనివాసరావు కె.కేదార్‌నాథ్, కె. రంగారావు, బి.ప్రసాద్, కె.కామాక్షి, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృత్యువాత

కర్లపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఓ రైతు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల మేరకు... కాకుమానుకు చెందిన దొప్పలపూడి చంద్రపాల్(61) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం వరినారు కోసం ద్విచక్రవాహనంపై బాపట్ల మీదుగా కర్లపాలెం వస్తున్నాడు. కర్లపాలెం మండలం నల్లమోతు వారిపాలెం సమీపంలో వెనుక నుంచి వచ్చిన ట్రక్ ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో చంద్రపాల్ తీవ్రంగా గాయపడటంతో అతనిని మొదటిగా బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో చంద్రపాల్ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రవీందర్ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని చిరు వ్యాపారి మృతి



వెంకట నరసయ్య (ఫైల్)

కొల్లూరు: అతి వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ చిరు వ్యాపారి తీవ్రంగా గాయపడి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మండలంలోని బొద్దులూరుపాడుకు చెందిన కొల్లూరు వెంకట నరసయ్య (68) గ్రామంలో కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం కొల్లూరులో సామగ్రిని కొనుగోలు చేసుకొని, మోపెడ్‌పై గాంధీనగర్‌లో నివసిస్తున్న కుమార్తెను చూసేందుకు వెళుతున్నారు. ఈ సమయంలో తెనాలి వైపు నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడు నరసయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అయన్ను కుమార్తె 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి నరసయ్య మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక మేరకు కొల్లూరు పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జానకీ అమర వర్ధన్ తెలిపారు.

డివైడర్‌ను బైకు ఢీకొట్టి యువకుడు దుర్మరణం

తెనాలి రూరల్: డివైడర్‌ను ఢీకొట్టి యువకుడు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి దాటాక తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట నిజాంపట్నం కాల్వ కట్టపై నివసించే అన్నపురెడ్డి పవన్(21) బైక్‌పై వెళుతూ కొత్త వంతెన వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాళ్ల ట్రాక్టర్ బోల్తా

కారంచేడు: మార్టూరు నుంచి చీరాలకు సరిహద్దు రాళ్ల లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదు. ఆదివారం వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో.. కారంచేడు అంబేడ్కర్ నగర్ కాలనీ సమీపంలో ఈ ఘటన జరిగింది. ట్రాక్టర్ ట్రక్కు వెనుక టైర్లకు ఉండే బేరింగ్‌లు ఊడిపోవడంతో ట్రక్కు ఒక్కసారిగా తిరగబడింది. ఆ సమయంలో ఇతర వాహనాలు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ కూడా నిదానంగా ప్రయాణిస్తుండటంతో కేవలం ట్రక్కు మాత్రమే బోల్తా పడింది. దీంతో రాళ్లు ప్రధాన రహదారిలో పడటంతో వాహన ప్రయాణాలకు కొంత సేపు అంతరాయం ఏర్పడింది. స్థానిక ఏఎస్ఐ శేషసాయి తన సిబ్బందితో అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన సత్తెనపల్లి విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరాటే మాస్టర్ అనుముల రామయ్య

సత్తెనపల్లి: సౌత్ ఇండియా జోనల్ కరాటే పోటీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి విద్యార్థులు ప్రతిభ చూపారు. బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో ఈనెల 30,31న జరిగిన సౌత్ ఇండియా జోనల్ కరాటే పోటీల్లో సత్తెనపల్లికి చెందిన షికోకాయ్ షిటోరియో కరాటే ఇనిస్టిట్యూట్ విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ చూపి ఐదు గోల్డ్ మెడల్, ఒక బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకుని సత్తెనపల్లి పట్టణానికి గుర్తింపు తీసుకొచ్చినట్లు కరాటే మాస్టర్ అనుముల రామయ్య ఆదివారం తెలిపారు. బాలికల కటా విభాగంలో బి అక్షయ్‌రెడ్డి గోల్డ్ మెడల్, బాలుర కటా విభాగంలో బి.టిష్యంత్, ఎంవీ.బాలాజీ, ఎల్ కిరీట్, ఎల్ గెష్టఆషిత్‌లు గోల్డ్‌మెడల్స్ సాధించగా .. బి.సత్యనారాయణ బ్రాంజ్ మెడల్ సాధించాడు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకాడమీ ఆర్గనైజర్ ఏ.వీరబ్రహ్మం, అడ్వైజర్ ఏ.రాంబాబులు ప్రత్యేకంగా అభినందించారు.

పులిచింతలకు 2.32 లక్షల క్యూసెక్కులు విడుదల



టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పరుగులు పెడుతున్న వరదనీరు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 17 క్రస్ట్ గేట్ల ద్వారా 2,32,037 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ తొమ్మిది క్రస్ట్‌గేట్లు మూడు మీటర్లు, ఎనిమిది క్రస్ట్ గేట్లు 2.5 మీటర్లు ఎత్తు ఎత్తి 2,32,037 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 74.58 మీటర్లకు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.462 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 60.54 మీటర్లకు చేరుకుందన్నారు. ఎగువనున్న నాగార్జునసాగర్ నుంచి 2,89,876 క్యూసెక్కుల వరదనీరు ఇక్కడ ప్రాజెక్టుకు చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

కుమ్మరి శాలివాహన సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న శాలివాహన సంఘీయులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో కుమ్మరి శాలివాహన సంఘీయుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్టు రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ తెలిపారు. పాలపాడురోడ్డులోని కల్యాణ మండపంలో ఆదివారం పల్నాడు జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సంఘం నూతన అధ్యక్షునిగా తొర్లకొండ చినఅంజయ్య, కార్యదర్శిగా వీరబ్రహ్మంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా యూత్ అధ్యక్షునిగా బాడిశ మస్తాన్‌రావు (పిడుగురాళ్ల) నియమితులయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఐలాపురం భాస్కర శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజవరపు ఏడుకొండలు, సంఘం నాయకులు టి.మంగమ్మ, రంగయ్య, బి.రోశయ్య, సిహెచ్.వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు చిన అంజయ్య మాట్లాడుతూ త్వరలో జిల్లాలో నియోజకవర్గాల వారీగా పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

'104' వాహన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మణరావు



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న లక్ష్మణరావు

లక్ష్మీపురం: 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఉద్యోగుల (ఎంఎంయూ) సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని జిల్లా గౌరవాధ్యక్షులు బి. లక్ష్మణరావు తెలిపారు. స్థానిక పాత గుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం కె. సత్యరాజు అధ్యక్షతన జరిగిన యూనియన్ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం తగ్గించిన వేతనాల సహా ఉద్యోగులకు చెల్లించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గత యాజమాన్యం అరబిందో నుంచి రావాల్సిన అన్ని బకాయిలను చెల్లించే విధంగా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు అమలయ్యే లీవులు, పబ్లిక్ హాలిడేలు, గుర్తింపు కార్డులు, పే స్లిప్పులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వాహనాలకు సరిపడా సిబ్బందిని నియమించాలని, అవసరమైన చోట బఫర్ జోన్ ఉద్యోగులను నియమించాలని కోరారు. వాహనాలకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేయక పోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, వెంటనే చేయించాలని ఆయన కోరారు. రూ. 10 లక్షల బీమా సౌకర్యాన్ని ప్రతి ఉద్యోగికి కల్పించాలని విన్నవించారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఈఎస్ఐ పరిధి దాటిన వారికి హెల్త్ కార్డులు ఇవ్వాలని లక్ష్మణరావు కోరారు. డిమాండ్ల సాధనకు నిర్వహించనున్న ఆందోళనలో ఉద్యోగులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన అధ్యక్ష, కార్యదర్శిగా గోరంట్ల సురేష్, ఆలూరి శ్రీహర్ష, కోశాధికారిగా ఐ. నాగులు, ఉపాధ్యక్షులుగా కె. సత్తిరాజు, సహాయ కార్యదర్శిగా బి. బాలకృష్ణ, కమిటీ సభ్యులుగా విజయ్ కుమార్, ఏడుకొండలు, సురేష్, సాయిరాం, విజయ్ నియమితులయ్యారు.

దుర్గమ్మకు పలువురు విరాళాలు






కనకదుర్గమ్మ ఆలయ అధికారులకు విరాళాలు అందజేస్తున్న దాతలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు ఆదివారం పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. గుంటూరు జిల్లా కొత్తూరుకు చెందిన మండవ శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి దంపతులు నిత్యాన్నదానానికి రూ. 1,00,001 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. గుంటూరుకు చెందిన తేగెల రవీంద్రబాబు, డాక్టర్ నాగేశ్వరమ్మలు తమ కుమార్తె మమత శ్రీరంగ పేరిట రూ.1,00,001 విరాళంగా ఇచ్చారు. అనంతరం దాతలకు అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. విరాళాలు ఇచ్చినందుకు అభినందించారు.

పారదర్శకత కోల్పోతున్న ఎన్నికల కమిషన్



మాట్లాడుతున్న దివాకర్ బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత ఎన్నికల సంఘం గత దశాబ్ద కాలంగా స్వయం ప్రతిపత్తిని కోల్పోవడంతో పాటు పారదర్శకంగా, జవాబు దారీతనంతో వ్యవహరించడం లేదని సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. దివాకర్ బాబు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో ఆదివారం రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురుదత్ అధ్యక్షతన ''రాజ్యాంగం – భారత ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి'' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య వక్త దివాకర్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగంపై నమ్మ కం, విశ్వాసం లేని వాళ్లు పాలకులుగా కొనసాగు తూ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ త్రిసభ్య కమిటీలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఆ స్థానంలో కేంద్ర మంత్రిని పెట్టడం సబబు కాదని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రను కోల్పోయే విధంగా కేంద్ర ప్రభు త్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. బిహార్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా 65 లక్షల ఓట్లను తొలగించడం, ఆధార్ కార్డును పరిగణన లోకి తీసుకోకుండా జనన ధ్రువీకరణ పత్రాలను కోరడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. అత్యధికులు బిహార్ నుంచి వలస కార్మికులుగా పలు రాష్ట్రాలకు పోతున్న స్థితిని ఎన్నికల కమిషన్ పరిగణలోకి తీసుకోకపోవడం విచారకరమని తెలిపారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌కు దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో సొంత సిబ్బంది ఉండాలని అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితా సక్రమంగా ఉంటే ప్రజా స్వామ్యం వికసిస్తుందని, దాని రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురుదత్ మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగం కలగకుండా దాన్ని కాపాడుకోవాలని కోరారు. రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ కాగ్, యూపీఎస్సీ, ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగబద్ధ సంస్థల్లో అధికార పార్టీల జోక్యం ఉండరాదని తెలిపారు. రాజ్యాంగ చర్చా వేదిక సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి. సేవా కుమార్, ప్రోగ్రెసివ్ ఫోరమ్ అధ్యక్షుడు పి. మల్లికార్జునరావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీపీఎం నేత నళినీ కాంత్, సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి ప్రసంగించారు.